సాక్షి నిర్మల్

సోమవారం। 27। నవంబర్। 2023



కడెంను కాపాడండి

కడెం ప్రాజెక్ట్‌ను కాపాడాలని ఆయకట్టు రైతాంగం వేడుకుంటోంది. రెండేళ్లుగా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కొత్త ప్రభుత్వం అయినా దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

6లో▸



ట్రిపుల్‌ఐటీ విద్యార్థి ఆత్మహత్య

బాసర ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న రామాటి ప్రవీణ్‌కుమార్ (19) వసతిగృహంలోని గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

6లో▸

గరిష్టం/కనిష్టం
28.4 /20.2

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత సాధారణం కన్నా తక్కువగా నమోదవుతుంది. అక్కడక్కడా చినుకులు పడే అవకాశం ఉంది.

బాసర స్మరణ.. రాంజీ ప్రేరణ



వేదికపై ప్రధాని మోదీతో కిషన్‌రెడ్డి, నిర్మల్, ఖానాపూర్, ముధోల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ అభ్యర్థులు

ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

- కొయ్యబొమ్మకు 'మోదీ గ్యారంటీ'
- పసుపు కోసం ప్రపంచం చూస్తోంది
- బీజేపీ గెలుపు స్పష్టంగా కనిపిస్తోంది
- నిర్మల్ సభలో ప్రధాని నరేంద్రమోదీ
- గెలిస్తే నిర్మల్ 'స్మార్ట్‌సిటీ' చేస్తాం..
- మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తాం : ఏలేటి



రాముడి వేషధారణలో చిన్నారి..



సకల జనుల విజయ సంకల్ప సభకు హాజరైన బీజేపీ నాయకులు, ప్రజలు

నిర్మల్: 'నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ శుభాభినందనాలు. బాసర సరస్వతీమాత చరణాలకు నా ప్రణామం. ఈ గడ్డపై పుట్టిన ఆదివాసీయోధులు కుమురంభీమ్, రాంజీగోండుకు నా నివాళులు. తన పోరాటంతో రాంజీగోండు యువతకు ప్రేరణగా నిలిచారు..' అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ రోడ్డులో పాతక్రషర్ ఎదురుగా ఆదివారం నిర్వహించిన సకల జనుల విజయసంకల్ప సభలో ప్రధాని పాల్గొన్నారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్ అభ్యర్థులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావుపటేల్, రమేశ్‌రాథోడ్, పాయల్ శంకర్, సోయం బాపూరావు తరఫున నిర్వహించిన ఈ ఎన్నికలసభకు భారీగా జనం తరలివచ్చారు. సభాప్రాంగణం నుంచి కనుచూపు మేరంతా జన సంద్రమే కనిపిస్తోందని, కాంగ్రెస్ సుల్తానులు, బీఆర్‌ఎస్ నిజాంలు ఒక్కసారి వచ్చి చూస్తే.. రాంజీగోండు ప్రేరణ, బీజేపీ గెలుపు ఖాయమన్న విషయం తెలుస్తుందని మోదీ అన్నారు. తమకు తాము రాజకీయ తీస్మార్‌ఖాన్ అనుకుంటున్నారో, రాజనీతి జ్ఞానిగా భావిస్తున్నారో ఒక్కసారి ఇక్కడికి వచ్చి చూడాలని సూచించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కేసీఆర్ ఎప్పుడో కారు స్టీరింగ్ వేరేవాళ్లకు అప్పగించి ఫామ్‌హౌస్‌కు వెళ్లి పడుకుంటున్నాడన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి అవసరమా అని ప్రశ్నించారు. సకల జనుల సౌభాగ్య తెలంగాణ కోసం ప్రజలంతా బీజేపీ వైపు నిలిచారని మోదీ చెప్పారు.

కొయ్యబొమ్మకు గ్యారంటీ..

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు మేడిన్ ఇండియా అన్న, మేకిన్ ఇండియా అన్న ఇష్టం ఉండదని ప్రధాని ఆరోపించారు. ఈ కారణంగానే ఘనమైన చరిత్ర కలిగిన నిర్మల్ కొయ్యబొమ్మల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మల్ కొయ్యబొమ్మలకు పూర్వవైభవం తీసుకువస్తామని, ఇది మోదీ గ్యారంటీ అని స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో ఏర్పాటు చేయనున్న జాతీయ పసుపుబోర్డుతో నిర్మల్ జిల్లా రైతులకూ మేలు కలుగుతుందన్నారు. ఇక్కడి పసుపురైతులు పండించే పసుపు కోసం ప్రపంచం ఎదురుచూస్తోందని తెలిపారు. కోవిడ్ తర్వాత పసుపు విలువ ప్రపంచానికి తెలిసి వచ్చిందన్నారు. వరి రైతులకు మద్దతుగా ధాన్యం క్వింటాల్‌కు రూ.3,100 చెల్లిస్తామని ప్రకటించామన్నారు.

తెలుగులో మాట్లాడుతూ..

ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడంతోపాటు మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. అసలు ప్రధానమంత్రి ఇంతా బాగా తెలుగు మాట్లాడగలరా.. అనేలా భాషను ఉచ్చరించారు. 'మొదటిసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకానుంది..' అని అనడంతో సభలో విశేష స్పందన వచ్చింది. 'ప్రజలను కలవని, సచివాలయానికి వెళ్లని సీఎం అవసరమా..' అంటూ తెలుగులోనే ప్రశ్నించారు. 'మోదీ గ్యారంటీ అంటే గ్యారంటీగా పూర్తి అయ్యేది..' అని చెప్పడం, ప్రతీసారి 'నా కుటుంబసభ్యులారా..' అని సంబోధించడం సభికులను ఆకట్టుకుంది. సభ ఆద్యంతం 'మోదీ.. మోదీ..' అన్న నినాదాలతో సభాప్రాంగణం మార్మోగింది.

డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని బీజేపీ నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని ఏడు సీట్లు గెలిచి మోదీకి బహుమతిగా ఇస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే నిర్మల్‌ను స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. అవినీతికి తావులేని పాలన కోసం పేద, బడుగు, బలహీనవర్గాల జీవితాలలో వెలుగు రావాలంటే కమలం గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. ఉచితంగా కోవిడ్ వ్యాక్సిన్ అందించి మనలందర్నీ కాపాడింది మోదీ అని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు రైలు మార్గం, ట్రైబల్ యూనివర్సిటీని మోదీ మంజూరు చేశారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ధాన్య మద్దతు ధర రూ.1000 పెంచి క్వింటాల్‌కు రూ.3,100 చెల్లించాలని మోదీ నిర్ణయించారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి రాగానే నిర్మల్‌లో ఆక్రమణకు గురైన భూములను పేదలకు పంచుతామన్నారు. ప్రస్తుత మాస్టర్ ప్లాన్ రద్దుచేసి ప్రజల కోసం వినీతి రహిత మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని చెప్పారు. బీడీ కార్మికుల కోసం వంద పడకల చెస్ట్ ఆసుపత్రి మంజూరు చేపిస్తామన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి

– పాయల్ శంకర్



నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించాలని, బీజేపీని గెలిపించాలని బీజేపీ ఆదిలాబాద్ అభ్యర్థి పాయల్ శంకర్ కోరారు. వారం రోజులుగా ఆదిలాబాద్‌లో బీజేపీ పుంజుకుంటోందన్నారు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల్లో వణుకు మొదలైందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు రోజులే సమయం ఉందని, బీసీని ముఖ్యమంత్రి చేసే బీజేపీని గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ తోడుదొంగలన్నారు. నిజాయతీపాలన కావాలంటే బీజేపీకి ఓటు వేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఇస్తున్న ప్రతి రూపాయి ప్రజలకు చేరాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలవాలన్నారు.

ధర్మానికి, అధర్మానికి యుద్ధం

– రాథోడ్ రమేశ్



నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 30న తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు ధర్మానికి అధర్మానికి జరిగే యుద్ధం లాంటిదని బీజేపీ ఖానాపూర్ అభ్యర్థి రాథోడ్ రమేశ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ సర్కార్ ఏర్పడడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఉన్న దొంగలను తరిమికొట్టడం ఓటు ద్వారానే సాధ్యమవుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఎంతోమంది నిరుద్యోగులు అల్లాడిపోతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి పొందేందుకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున రుణాలు ఇస్తామని తెలిపారు.

కాషాయంలో జోష్

నిర్మల్/నిర్మల్‌టౌన్: తొలిసారి జిల్లాకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నీరా'జనం' లభించింది. అసెంబ్లీ ఎన్నికలకు నాలుగురోజుల ముందు చేపట్టిన సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ఊహించని రీతిలో నలువైపుల నుంచి తరలిరావడంతో నిర్మల్ కాషాయమయమైంది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచే సభాప్రాంగణం నిండిపోయింది. ప్రధాని వచ్చేసమయానికి సమీకృత కలెక్టరేట్ రోడ్డంతా కిక్కిరిసిపోయింది. సభాప్రాంగణం చాలక పోవడంతో చాలా మంది బయట, రోడ్లపై నిల్చున్నారు.

ఎమ్మార్పీఎస్, జనసేన మద్దతు..

మాదిగ రిజర్వేషన్లకు ప్రధాని మోదీ అండగా నిలువడంతో నిర్మల్‌సభకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మద్దతుగా తరలివచ్చారు. ఎమ్మార్పీఎస్ జెండాలు పట్టుకుని వారంత సభలో పాల్గొన్నారు. జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పార్టీ జెండాలతో సభకు వచ్చారు.



పాదాభివందనాన్ని వారిస్తున్న ప్రధాని మోదీ

ఎంపీ 'సోయం' గైర్హాజరు..

నిర్మల్‌లో నిర్వహించిన మోదీ సభలో ఆదిలాబాద్ ఎంపీ, బీజేపీ బోథ్ అభ్యర్థి సోయం బాపురావు గైర్హాజరయ్యారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలందరూ పాల్గొన్నారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, రమేశ్ రాథోడ్, పాయల్ శంకర్, అజ్మీరా ఆత్మారాం నాయక్ హాజరయ్యారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఉమ్మడి ఆదిలాబాద్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎమ్మెల్యే సుమన్‌రాథోడ్, తదితరులంతా హాజరయ్యారు. బోథ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న సోయం బాపురావు ప్రధాని సభకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

పాదాభివందనం చేయబోతే..

నిర్మల్ సభలో పాల్గొన్న మోదీ తన ప్రసంగం ముగించుకుని వచ్చిన తర్వాత వేదికపై ఉన్న వారందరూ దగ్గరకు వచ్చి కలిశారు. ఈక్రమంలో అక్కడే ఉన్న ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్ మోదీకి పాదాభివందనం చేయబోయారు. అలా చేయవద్దంటూ.. మోదీ కూడా ముందుకు వంగి ఆమెకు అభివాదం చేయడం ఆకట్టుకుంది.

ఘనంగా మహాలక్ష్మి, సుదర్శన యాగాలు



యాగంలో పాల్గొన్న భక్తులు



దీపారాధనలో మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం శ్రీమహాలక్ష్మియాగం, సుదర్శనయాగంతోపాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, నిమ్మగడ్డ సందీప్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. రాత్రికి దీపారాధన చేశారు. సోమవారం రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు నిమ్మగడ్డ రాజన్న తెలిపారు.

ఖానాపూర్‌లో గెలిచే పార్టీకే పగ్గాలు



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి

ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు

- ప్రస్తుత ఎమ్మెల్యే సక్రమంగా లేకనే జాన్సన్‌కు టికెట్ ఇచ్చిన
- రాయేదో.. రత్నమేదో తెలుసుకుని ఓటేయాలి
- మళ్లీ గెలిచాక సదర్మాట్ ఆయకట్టు మరో 20వేల ఎకరాలకు పెంచుతాం
- ఎన్నికలయ్యాక ఖానాపూర్ వచ్చి సమస్యలన్నీ పరిష్కరిస్తా
- ఖానాపూర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్



సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

ఖానాపూర్/కడెం: ఖానాపూర్ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే.. రాష్ట్రంలో అదే పార్టీ అధికారంలోకి వస్తుందని, ఇక్కడ ఎవరు గెలవాలో.. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం రావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని జేకే నగర్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖానాపూర్ వచ్చిన సీఎంకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, బీఆర్‌ఎస్ ఖానాపూర్ అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సభలో కేసీఆర్ మాట్లాడారు. ప్రసంగం ఆయన మాటల్లో.. 'జాన్సన్ నాయక్ గురించి మీకు ఎంతవరకు తెలుసో నాకు తెలియదు.. జాన్సన్ నా కుమారుడు రాము క్లాస్‌మేట్. మొన్న రాము జన్నారం వచ్చినప్పుడు ఖానాపూర్‌ను దత్తత తీసుకుంటానన్నాడని నాకు తెలిసింది. రాము దత్తతతీసుకున్నాక మీకు ఏం తక్కువ కాదు. కేటీఆర్ తీసుకుంటే నేను తీసుకున్నట్టే. జాన్సన్‌కు ఓటు వేస్తే నాకు వేసినట్టే. ఆయన డబ్బుల కోసం రాజకీయాల్లోకి రాలేదు. దేవుడు ఆయనకు చాలా డబ్బులు ఇచ్చాడు. అతనికి అమెరికాలోనే సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయి. యువకులు, చదువుకున్నోళ్లు రాజకీయాల్లోకి రావాలని జాన్సన్‌ను నేనే రమ్మన్న.

ఇక్కడ ఎమ్మెల్యే సక్కగ లేకనే..

ఖానాపూర్ ఎమ్మెల్యే సక్కగ లేరు. ఇక్కడంతా పిచ్చిపిచ్చి వ్యవహారం ఉంది. ఎమ్మెల్యే లంచాలు తీసుకుంటుందని ఫిర్యాదులు వచ్చాయి. అందుకే చదువుకున్న బుద్ధిమంతులు ఖానాపూర్ ఎమ్మెల్యేగా ఉండాలని జాన్సన్‌కు టికెట్ ఇచ్చిన. అతను టికెట్ అడుగలేదు. నిస్వార్థంగా సేవచేస్తాడు. మీకు ఏం కావాలన్నా నిమిషాల్లో వస్తాయి. రాయేదో రత్నమేదో తెలుసుకుని ప్రజలు ఓటెయ్యాలి.

రోజంతా ఇక్కడే ఉంటా..

డిసెంబర్ 3 తర్వాత ఎన్నికలు పూర్తయితయ్.. మళ్లీ మన ప్రభుత్వమే ఏర్పడుతది. కొత్త ప్రభుత్వం కొలువుదీరినంక నేనే ఇక్కడికి వస్తా.. రాష్ట్రస్థాయి అధికారులను తోలుకొని వస్తా. దినమంతా ఖానాపూర్‌లో మీతోనే ఉండి ఏమేం పనులు కావాలో నోట్‌చేసుకుని అవ్వన్నీ చేపిస్తా. బుద్ధిమంతుడైన జాన్సన్‌కు దేశవిదేశాలు తిరిగిన అనుభవం ఉంది. మా కుటుంబానికి దగ్గరున్న వ్యక్తి గెలిస్తే మీకు లాభం జరుగుతది.

'సదర్మాట్' బాధ్యత నాదే..

'సదర్మాట్ నిర్మాణం పూర్తిచేసి ఆయకట్టు రైతులకు నీరందించే పూర్తి బాధ్యత నాదే' అని కేసీఆర్ అన్నారు. 'ఇప్పటికే 15 వేల ఎకరాలకు నీరిస్తున్నం. ఆయకట్టు మ రో 20వేల ఎకరాలు పెంచుతం. జాన్సన్ చెప్పిన విధంగా ఖానాపూర్‌లో డిగ్రీకళాశాల మంజూరు చేస్తాం. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తా. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఆంక్షలు ఎత్తేసేలా చూస్తా. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. కాంగ్రెస్ పార్టీకి పొరపాటున ఓటేస్తే రైతులు అన్యాయమైతరు. రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉంటే సుభిక్షంగా ఉంటదో ఆలోచించి ఓటు వేయాలి' అని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దండె విఠల్, మధుసూదనచారి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు రవీందర్‌రా వు, నాయకులు పూర్ణచందర్‌నాయక్, జానుబాయి, చారులత, అంకం రాజేందర్, భరత్‌చౌహాన్, నారాయణరావు, కొప్పుల నరేశ్, రామునాయక్, రాంకిషన్‌రెడ్డి, పాకల రాంచందర్, మోహిద్, వెంకాగౌడ్, రాజగంగన్న, పరిమి సురేశ్, శ్రావణ్, శ్రీనివాస్, కిశోర్, గంగాధర్, సతీశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చివరిశ్వాస వరకు ప్రజా సేవచేస్తా..

– జాన్సన్ నాయక్..



తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఖానాపూర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన సీఎం కేసీఆర్ గర్వపడేలా చివరిశ్వాస వరకు ప్రజా సేవచేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెనుకబడిన ఖానాపూర్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్ చేయడంతోపాటు సదర్మాట్ బ్యారేజీ నుంచి ఖానాపూర్ వరకు ప్రత్యేక కాలువ ఏర్పాటు చేయాలని సీఎంను కోరారు. కడెం ప్రాజెక్టును ఆధునికీకరించడంతోపాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్నారు. కవ్వాల్ టైగర్‌రిజర్వ్ ఫారెస్ట్‌లో ఆంక్షలు సడలించి టూరిజం హబ్ చేయాలని కోరారు. మారుమూల గిరిజన గ్రామాలైన పెంబి మండలం యాపల్‌గూడ, గుమ్మెన, సిరిచెల్మ, కడెం మండలం గంగాపూర్, అల్లంపల్లి ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.



ఖానాపూర్ ప్రజా ఆశీర్వాద సభ వేదికపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దండే విఠల్, మధుసూదనచారి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి తదితరులు..

బరిలో మేముసైతం..

- ఎన్నికల్లో పెరుగుతున్న పోటీదారులు
- ప్రధాన పార్టీల అభ్యర్థులకు తలనొప్పి

భైంసాటౌన్: ఎన్నికల్లో పోటీచేసే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల ప్రారంభంలో ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్‌తోపాటు స్వతంత్రులు మాత్రమే అసెంబ్లీ స్థానానికి పోటీ పడేవారు. దీంతో ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు మాత్రమే బరిలో ఉండేవారు. తర్వాత కాలంలో పలు జాతీయ పార్టీలతోపాటు ప్రాంతీయ పార్టీల నుంచి అభ్యర్థులు, స్వతంత్రులు పోటీలో ఉంటున్నారు. మొదట్లో ఎమ్మెల్యే కావాలనే ఆకాంక్షతో ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న సదుద్దేశంతో పోటీలో నిలబడేవారని, కాగా, రానురాను కొందరు స్వప్రయోజనాల కోసం, మరికొందరు ఓట్లు చీల్చి ప్రత్యర్థిని ఓడించాలన్న ఉద్దేశంతో బరిలో ఉంటున్నారు. కాగా, సామాజికవర్గాల వారీగా ఓట్లను చీల్చేందుకు పలువురు స్వతంత్ర అభ్యర్థులను ప్రధాన పార్టీలు బరిలో దింపుతున్నాయి.

ప్రధాన పార్టీలకు తలనొప్పిగా..

ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓవైపు ప్రచారంలో జోరు పెంచుతుండగా నియోజకవర్గ పరిధిలో స్వతంత్రులు, చిన్న పార్టీల అభ్యర్థులు తలనొప్పిగా మారుతున్నారు. అసలే హోరాహోరీగా పోటీ నెలకొన్న తరుణంలో వీరు సాధించే ఓట్లు కీలకంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల గెలుపు ఓట ములను ప్రభావితం చేయబోతున్నారు. ఒక నియోజకవర్గంలో ప్రధాన పార్టీలకు అదనంగా ఒకరి ద్దరు బరిలో ఉంటే ఎలాగోలా నెట్టుకు రావచ్చు. కానీ పది మందికిపైగా పోటీలో ఉండడం సమస్యగా మారింది.

ఇప్పటి వరకు ఒకే ఈవీఎం..

అభ్యర్థుల సంఖ్య పెరిగితే ఈవీఎంల సంఖ్య పెంచాల్సిన పరిస్థితి వస్తుంది. ఒక ఈవీఎంలో 15 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది. 16వ నంబర్ నోటా. 15 మందికంటే ఎక్కువగా బరిలో ఉంటే ఈసీ రెండు యూనిట్లను ఉపయోగించాల్సిన పరిస్థితి. ఈవీఎంలు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రెండో ఈవీఎం ఉపయోగించాల్సిన అవసరం రాలేదు.

1957 నుంచి 2018 వరకు నియోజకవర్గాలవారీగా బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య

ఏడాది	ముధోల్	నిర్మల్	ఖానాపూర్
1957	02	03	–
1962	04	02	–
1967	02	03	–
1972		ఏకగ్రీవం	
1978	09	05	06
1983	06	07	07
1985	04	12	04
1989	04	08	05
1994	06	07	04
1999	09	06	06
2004	07	05	07
2009	12	09	10
2014	06	07	06
2018	12	08	12
2023	14	13	11

ప్రచారం అడ్డగింత

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లిలో ఆదివారం బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ క్రమంలో కొందరు యువకులు ప్రచారాన్ని అడ్డుకున్నారు. గతంలో జరిగిన ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించనివారు ఇప్పుడు ప్రచారానికి ఎలా వచ్చారని నిలదీశారు. బీఆర్‌ఎస్ డౌన్‌డౌన్, గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో సర్దిచెప్పిన నాయకులు అనంతరం ప్రచారం కొనసాగించారు.



బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకుంటున్న యువకులు

క్లుప్తంగా

'సంగెం'కు న్యాయశ్రీ అవార్డు



సుధీర్‌కుమార్ అవార్డు అందిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి నంద

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్ ఆదివారం న్యాయశ్రీ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి సురేపెల్లి నంద చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. న్యాయ వ్యవస్థలో అత్యున్నత సేవలు అందిస్తున్న వారికి మదర్ పౌండేషన్, మేఘా సిటీ నావకళా వేదిక ఆధ్వర్యంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సుధీర్‌కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. అవార్డు ప్రదానంలో అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్, నావకళా వేదిక అధ్యక్షుడు మల్లికార్జున పాల్గొన్నారు.

పెన్‌గంగ తీరం.. భక్తజనసంద్రం



చక్రస్నానం చేయిస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్ మండల శివారులోని పెన్‌గంగ నదీతీరంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక చక్రస్నానాలు ఆచరించారు. రెండు రోజులుగా పెన్‌గంగ నదీతీరంలో అర్లి(టి) రామాలయం మహరాజ్ శివానంద భారతిస్వామి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. హోమంతో పాటు పెన్‌గంగ నదిలో శ్రీసీతారామచంద్రుల ఉత్సవ మూర్తులకు భక్తజనుల చక్రస్నానాలు చేయించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున భక్తులు రావడంతో నదీతీరం భక్తజనంతో సందడిగా మారింది. కార్యక్రమంలో నిర్వహకుడు చిల్కూరి సంజీవ్‌రెడ్డి, గ్రామసర్పంచ్ హనుమాన్‌దాస్, ఉపసర్పంచ్ వెంకటస్వామి, గ్రామపెద్దలు శ్రీనివాస్, భోజన్న పాల్గొన్నారు.

ఒకరి అరెస్ట్

తలమడుగు: హిందూ దేవుళ్లపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ధనశ్రీ తెలిపింది. ఎస్సై వివరాల ప్రకారం... మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన షేక్‌షమీర్ అనే వ్యక్తి హిందూ దేవుళ్లపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడంతో ఆదివారం సుంకిడి గ్రామానికి చెందిన అంబటి సుభాష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మతాల మధ్య రెచ్చగొట్టే మాటలు మాట్లాడే ఎలాంటి వారినైనా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొంది.

మహిళపై అడవిపంది దాడి

బోథ్: నేరేడుపల్లె గ్రామానికి చెందిన మడావి సులోచనపై ఆదివారం అడవిపంది దాడి చేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేనులో పత్తి ఏరుతుండగా వెనకాల నుంచి అడవిపంది దాడి చేసింది. దీంతో ఆమె కాలికి తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబీకులు వెంటనే బోథ్‌లోని సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతోంది.

'కడెం'ను కాపాడండి

- ఆధునీకరించి, ఆదుకోవాలి
- ఆయకట్టు రైతుల విజ్ఞప్తి



కడెం ప్రాజెక్ట్

కడెం: ఉమ్మడి జిల్లా వరప్రదాయిని కడెం ప్రాజెక్ట్‌ను కాపాడాలని ఆయకట్టు రైతాంగం వేడుకుంటోంది. రెండేళ్లుగా వానాకాలం వణుకు పుట్టిస్తూ.. లోతట్టు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపిన రోజులు మనం చూశాం. భారీ వరదలతో ప్రాజెక్ట్ దిగువన పంట, పొలాలు ధ్వంసమయ్యాయి. భూములు దె దెబ్బతిన్న రైతులకు నేటికి నష్టపరిహారం అందలేదు. రెండేళ్లుగా గడిచిన ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో మరమ్మతులు కాలేదు. రానున్న ప్రభుత్వామైన కడెం ప్రాజెక్ట్‌పై దృష్టి సారించి పూర్తిగా ఆధునీకరించి, ఆయకట్టుకు అండగా నిలవాలని ఆయకట్టు రైతాంగం వేడుకుంటుంది. 68వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి ఎడమ కాల్వ, 70 కిలో మీటర్లు, కుడి కాల్వ 10 మీటర్లు పొడవు ఉంటుంది.

కాలువలు బాగు చేయాలి



కడెం ప్రాజెక్ట్ ఎడమ కాలువ లైనింగ్ దెబ్బతినడం, కాలువలకు గండ్లు పడడంతో సక్రమంగా సాగు నీరందడం లేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలి.

– విష్ణుమూర్తి, రైతు, కలమడుగు, జన్నారం

ఆధునీకరించాలి



కడెం ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి. గతంలో ఉన్నతాధికారులు ప్రాజెక్ట్‌ను పరిశీలించి వెళ్లిన నేటికి స్పందన లేదు. ఆధునీకరణ, లేదంటే నూతన ప్రాజెక్ట్ నిర్మించి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలి.

– శంకర్, రైతు పాండ్వపూర్

పట్టించుకోవాలి



కడెం ప్రాజెక్ట్‌కు రెండేళ్లుగా భారీ వరదలు వచ్చి గేట్లు పనిచేయకపోవడంతో ప్రాజెక్ట్ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. రెండేళ్ల గడిచిన నేటికి ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేకపోయారు. రానున్న ప్రభుత్వమైన కడెంను పట్టించుకోవాలి.

– కొండ్ర మల్లయ్య, రైతు, పాండ్వపూర్

సిబ్బందిని నియమించండి



గత కొన్నేళ్లుగా కడెం ప్రాజెక్ట్‌పై సిబ్బంది రిటైర్మెంట్లు తప్ప నియమకాలు లేవు. ఇటీవల ప్రభుత్వం వీఆర్ఏల తో సర్దుబాటు చేసింది. అయితే వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్ తదితర టెక్నికల్ సిబ్బందిని నియమించాలి.– కొయ్యాడి రాజేశ్, రైతు, రాంపూర్, దస్తురాబాద్

పరిహారం ఇవ్వలేదు



రెండేళ్ల క్రితం కడెం ప్రాజెక్ట్ నుంచి వచ్చిన భారీ వరదలతో ప్రాజెక్ట్ దిగువన గల మా పొలాం పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు వచ్చి సర్వే చేశారు. నేటికీ నష్టపరిహారం రాకపోవడంతో భూములను అలాగే వదిలేశాం. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పరిహారం అందజేయాలి.

– హరీశ్, పాండ్వపూర్, కడెం

ఓటు వినియోగంలో ముల్తానీల ముందంజ



కేశవపట్నం గ్రామం

ఇచ్చోడ: ఎన్నికల్లో ఓటును వినియోగింకోవడంలో మూల్తానీలు ముందంజలో డుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇచ్చోడ మండలంలో గుండాల, కేశవపట్నం, ఎల్లమ్మగూడ గ్రామాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న మూల్తానీలు గతంలో కలప స్మగ్లింగ్‌పైనే ఆధారపడేవారు. మూల్తానీల్లో 90శాతానికి పైగా నిరక్షరాస్యులే. కానీ ఎన్నికల్లో ఓటు వేయడంలో వారు ముందంజలో ఉంటారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందంటే చాలు మూల్తానీల గ్రామాల్లో వాతావారణం ఒక్కసారిగా వేడెక్కుతుంది. ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో వారికి నచ్చిన వారి కోసం ఆ గ్రామాల ఓటర్లు ఎంతకైనా తెగిస్తారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ అక్కడి గ్రామాల్లో ఎన్నికల కోలాహలం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పోలింగ్ రోజు పోటీపడి ఓట్లు వేస్తారు. వృద్ధులను సైతం పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి ఓట్లు వేయిస్తారు. ఎన్నికలపై ముల్తానీలకు ఉన్న మోజు భారీగా పోలింగ్ దిశగా అడుగులు పడుతుండటం గమనార్హం.

2018లో మూల్తానీ గ్రామాల్లో పోలైన ఓట్ల వివరాలు...

గ్రామం పేరు	పురుషులు	మహిళలు	మొత్తంఓట్లు	పోలైనఓట్లు
కేశవపట్నం	749	877	1,626	1,442
గుండాల	591	510	1101	1090
ఎల్లమ్మగూడ	207	238	445	390
మొత్తం	1,547	1,625	3,172	2,922

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

- భైంసా పోస్టుమార్టం గదిలో విద్యార్థి మృతదేహం
- ఆస్పత్రి వద్ద పోలీసు బందోబస్తు
- విద్యార్థి మృతిపై అనుమానాలు



రామాటి ప్రవీణ్‌కుమార్ మృతదేహం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న రామాటి ప్రవీణ్‌కుమార్ (19) వసతిగృహంలోని గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగర్‌కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థి వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రిపుల్‌ఐటీ అధికారులు చెబుతున్నారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు.

ఔట్‌పాస్ తీసుకుని...

ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రవీణ్‌కుమార్ శనివారం ఔట్‌పాస్ తీసుకున్నాడు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు విద్యార్థులు ఇళ్లకు వెళ్తున్నారు. శనివారం ఔట్‌పాస్ తీసుకున్న విద్యార్థి ఆత్మహత్య ఎప్పుడు చేసుకున్నాడో అంతుచిక్కడం లేదు. అధికారులైతే ఆదివారం ఉదయం అల్పాహారం చేశాడని చెబుతున్నారు. ఒక రోజు ఔట్‌పాస్ తీసుకున్న విద్యార్థి అక్కడే ఎందుకు ఉండిపోయాడనే విషయం అంతుపట్టని ప్రశ్న. ఔట్‌పాస్ తీసుకున్న విద్యార్థులు కళాశాలలో ఉన్నారో బయటికి వెళ్లిపోయారా అనే విషయాన్ని భద్రతా సిబ్బంది చూసుకుంటున్నారో లేదో అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఖాళీ గదిలో ఆత్మహత్య...

ప్రవీణ్‌కుమార్ బీహెచ్–1 వసతి గృహంలో ఉంటున్నాడు. ఆదివారం బీహెచ్–2 వసతి గృహంలోని ఖాళీ గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వసతి గృహంలోని ఖాళీ గదుల్లోనే గతంలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. వసతి గృహాల్లో ఖాళీ గదులకు తాళాలు ఎందుకు వేయడం లేదనే అనుమానం తలెత్తుతోంది. ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థి మెడ భాగం కమిలిపోయి ఉందని, ఆత్మహత్య ఎప్పుడు చేసుకున్నాడో తెలియడం లేదని పలువురు చెబుతున్నారు.

పోలీసు భద్రత...

విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న వెంటనే మృతదేహాన్ని అంబులెన్సులో భైంసాకు తరలించారు. పోస్టుమార్టం గది వద్దకు ఎవరిని అనుమతించలేదు. మృతదేహాన్ని లోపల భద్రపరిచి తాళం వేశారు. ఆసుపత్రి వద్ద పోలీసు బందోబస్తు మోహరించారు. ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయనే విషయం అంతుచిక్కడం లేదు.

వ్యక్తిగత కారణాలతోనే..

నాగర్‌కర్నూలు జిల్లాకు చెందిన రామాటి ప్రవీణ్‌కుమార్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఔట్‌పాస్ తీసుకున్నాడు. ఉదయం వేళ అల్పాహారం చేసిన ఈ విద్యార్థి బీహెచ్–2 వసతి గృహంలోని ఖాళీగదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నాం. ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలియజేశాం.

– ప్రొఫెసర్ వెంకటరమణ, వీసీ

ప్రాణహిత తీరం వెంట డ్రోన్ నిఘా

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్ ప్రారంభం



అర్జునగుట్టలో డ్రోన్‌తో నిఘాను పరిశీలిస్తున్న సీపీ



డ్రోన్ దృశ్యాలను పరిశీలిస్తున్న సీపీ

వేమనపల్లి/కోటపల్లి: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత తీరం వెంట డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. ఆదివారం మంచిర్యాల డీసీపీ రాంనాథ్‌కేకన్, మనోజ్‌కుమార్ ఐపీఎస్‌లతో కలిసి మంచిర్యాల జిల్లా వేమనపల్లి ఫెర్రీ పాయింట్, కోటపల్లి మండలం అర్జునగుట్ట, వెంచపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ మావోయిస్టుల కదలికలు, సంఘ విద్రోహ కార్యకలాపాలపై ముందస్తు సమాచారం తెలుసుకోవడం కోసం తీరం వెంట సాంకేతిక పరిజ్ఞానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించి ఎన్నికలు పూర్తయ్యే వరకు డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసులు కృషి చేస్తారని అన్నారు. మంచిర్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి తీర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల నిబంధనల మేరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర బలగాలు, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, జార్ఖండ్, ఆర్మూర్ బెటాలియన్ సిబ్బంది విధుల్లో నిమగ్నమైనట్లు తెలిపారు. అనంతరం ఆయా మండలాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మంగీలాల్, ఎస్సైలు సుబ్బారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ వినియోగం

- ఆగని ఉపాధ్యాయుల ఆందోళనలు



క్యూలో నిల్చున్న ఉపాధ్యాయులు



ఓటు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ వినియోగం జిల్లాలో కొనసాగుతోంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎన్నికల విధులకు నియమాకమైన ఉద్యోగ, ఉపాధ్యాయులు, పోలీసులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఇదే క్రమంలో ఓటు వినియోగానికి సంబంధించిన ఆందోళనలు కూడా ఆగడం లేదు. ఆదివారం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చిన పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసిన జాబితాలో తమ పేర్లు లేకపోవడంపై ఆందోళన చేపట్టారు. అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల విధుల ఉత్తర్వులు పొందిన రోజునే పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికీ జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. బోథ్‌కు వెళితే, నిర్మల్‌కు, అక్కడకు వెళితే ఆసిఫాబాద్‌కు వెళ్లాలంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ తమ ఓటు హక్కును దూరం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాగా జిల్లాలో ఎంతమందికి పోస్టల్ బ్యాలెట్‌ను కేటాయించారు, అందులో ఎంతమంది వినియోగించారనే వివరాలపై కలెక్టరేట్ అధికారులను సంప్రదించగా ఎలాంటి సమాధానం చెప్పకపోవడం వారి బాధ్యత రహిత్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఓటు హక్కు కీలకమని ప్రచారం చేసే అధికారులు తమ ఓటు హక్కును దూరం చేసేలా వ్యవహరించడమేమిటని వారు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే జర్నలిస్టులకు తొలిసారిగా కల్పించిన పోస్టల్ బ్యాలెట్‌ను ముగ్గురు జర్నలిస్టులు వినియోగించుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ



నేరడిగొండ: స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సైసాయన్న, సిబ్బంది

కైలాస్‌నగర్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేయడంతో పాటు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్, వన్‌టౌన్ సిఐ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి స్థానిక కలెక్టర్‌చౌక్ ఏరియాలో వాహనాలు తనిఖీ చేపట్టారు. మావల మండల చెందిన రాజేశ్వర్ అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహణకు సుమారుగా రూ.20వేల విలువైన 93 రాయల్ స్టాగ్ లిక్కర్ బాటిల్స్‌ను అనుమతి లేకుండా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అలాగే సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

నేరడిగొండలో...

నేరడిగొండ: అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కుమారి గ్రామ సమీపంలో శనివారం వాహనాల తనిఖీలు చేస్తుండగా నేరడిగొండ వైపు నుంచి వస్తున్న టవేరా వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో తరలిస్తున్న 960 విస్కీ బాటిళ్లను పట్టుకున్నారు. వాటి విలువ రూ.లక్షా90వేలు ఉంటుందని పేర్కొన్నారు. టవేరా వాహనం స్వాధీనం చేసుకోవడంతో పాటు డ్రైవర్ షేక్ అజీమ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఈ సందర్భంగా వివరించారు.

మద్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేయడంతో పాటు లీటరు సామర్థ్యం గల ఆరు మద్యం బాటిళ్లు, కారును సీజ్ చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ఓ కారులో యాపల్‌గూడకు చెందిన ముగ్గురు, తంతోలి, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మరో ఇద్దరు కారులో మద్యం తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరు ఆదిలాబాద్ పట్టణం నుంచి మండలంలోని తంతోలి వైపు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపాడు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.

రూ.40వేల విలువైన మద్యం..

జైనథ్: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పోలీసుల దాడుల్లో రూ.40వేల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తుండగా అన్వేష్‌రెడ్డి, ఐతే సాయిల వద్ద నుంచి మద్యం లభించినట్లు పేర్కొన్నారు. మద్యం సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామానికి చెందిన బకేవార్ లింగాబాయి (65) నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పతిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లింగాబాయి ఈ నెల 15వ తేదీ రాత్రి తన ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకుని శరీరం కాలిపోయింది. గమనించిన కుటుంబీకులు భైంసాకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జైపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం భీమారంకు చెందిన సోలంకి సునీల్ (28) చెన్నూర్‌లో తన కులవృత్తి అయిన సికమ్మరి పని చేసుకుంటూ భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. శనివారం పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై చెన్నూర్ నుంచి జైపూర్ వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కీర్తన, ముగ్గురు కుమార్తెలు, కుమారుడున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

సమయం లేదు మిత్రమా..

- చివరి దశకు ఎన్నికల ప్రచారం
- ఇప్పటికే పల్లె, పట్టణం చుట్టేశారు
- ప్రతీ ఓటరును కలవాలనే అభ్యర్థుల ఉబలాటం

సాక్షి,ఆదిలాబాద్: అంతా తిరిగాం.. అయినప్పటికీ ఏదో తెలియని వెలితి.. ప్రతి ఓటరును కలిశానా.. లేదా.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ప్రస్తుతం నెలకొన్న సందిగ్ధం. మిగిలింది కొద్ది సమయమే. ఆ మిగిలిన వారిని కూడా కలవాలనే ఉబలాటం. మరి ప్రచారం సంపూర్ణమవుతుందో.. అసంపూర్ణమో ఆ అభ్యర్థికే తెలియాలి.

ఇదీ పరిస్థితి..

బీఆర్ఎస్ అభ్యర్థుల పరంగా ఆదిలాబాద్‌లో జోగు రామన్న ప్రచారం పట్టణంలోని కొన్ని వార్డులను పూర్తి చేస్తే సంపూర్ణమే. బోథ్‌లో అనిల్ జాదవ్ ఇప్పటికే తొమ్మిది మండలాల్లో తిరిగారు. రెండో విడత కూడా చుట్టేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల పరంగా ఆదిలాబాద్‌లో కంది శ్రీనివాసరెడ్డి ఆదిలాబాద్ పట్టణంలోని కొన్ని వార్డులను తిరిగితే ప్రచారం పూర్తవుతుంది. ఈ మిగిలిపోయిన సమయంలో ఆ ప్రచారాన్ని పూర్తి చేసేవిధంగా ప్రణాళిక రూపొందించుకున్నారు. బోథ్‌లో ఆడె గజేందర్ కొన్ని గ్రామాల్లో ప్రచారం మిగిలింది. ఈ మిగిలిన రోజు ల్లో పూర్తి చేయాలని చూస్తున్నారు. బీజేపీ ఆది లాబాద్ అభ్యర్థి పాయల్ శంకర్ పట్టణంలోని కొన్ని వార్డుల్లో పూర్తి చేయాల్సి ఉంది. బోథ్‌లో సోయం బాపురావు 9మండలాల్లో ప్రచారం పూర్తి చేశారు. అక్కడక్కడా మిగిలిపోయిన కొన్ని గ్రామాల్లో ఈ మిగిలిన సమయంలో చుట్టివచ్చే విధంగా ముందుకు కదులుతున్నారు. ఆదిలాబాద్‌లో స్వతంత్ర అభ్యర్థి అల్లూరి సంజీవరెడ్డి ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని ఒకట్రెండు గ్రామాలు, పట్టణంలోని కొన్ని వార్డుల్లో ప్రచారం పూర్తి చేస్తే సంపూర్ణం. మిగిలిన సమయంలో అక్కడ తిరగాలని ప్రణాళిక చేశారు.

'బర్రెలక్క'కు వినూత్న సంఘీభావం...



గేదెలను మేపుతున్న స్వదేశ్

నిర్మల్ ఖిల్లా: కొల్లాపూర్ శాసనసభ నియోజకవర్గంలో బరిలో నిలిచిన బర్రెలక్క అలియాస్ శిరీషకు నిర్మల్ నియోజకవర్గ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి స్వదేశ్ పరికిపండ్ల సంఘీభావం ప్రకటించారు. అనేక ఒత్తిడుల మధ్య కొల్లాపూర్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్న శిరీషకు ఆదివారం వినూత్న రీతిలో గేదెలను కాస్తూ సంఘీభావం ప్రకటించారు. నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని రాణాపూర్ వద్ద పగలంతా బర్రెలను కాస్తూ మద్దతు తెలిపారు. పీజీలు, బీఈడీలు చదివిన తనకు, తమలాంటి ఎందరో యువకులకు ఉద్యోగాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.